ఈనాడు
నంద్యాల
ఆదివారం అక్టోబరు 6, 2024

రైతుల అభ్యున్నతికి కృషి

-ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ మన్నే సుబ్బారెడ్డి

బనగానపల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ మన్నే సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం విజయవాడ మండలం ప్రసాదంపాడులోని విత్తనాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వ్యవసాయానికి పెద్ద పీట వేస్తోందన్నారు. నంద్యాల జిల్లా తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, డోన్ నియోజకవర్గ తెదేపా నాయకులు, కార్యకర్తలు, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుబ్బారెడ్డి, చిత్రంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తదితరులు

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించి రుణం తీర్చుకుంటానని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. పట్టణంలోని మూడో వార్డు నడిగడ్డ కూడలిలో శనివారం ఆయన ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.


సమస్యలు వింటున్న మంత్రి ఫరూక్

వన్యప్రాణుల ప్రేమాలయం

❖ సమస్త ప్రాణుల సమాహారం నల్లమల

❖ కొనసాగుతున్న సంరక్షణ వారోత్సవాలు

❖ పిల్లలూ సెలవుల్లో చూసేద్దాం


-ఆత్మకూరు, న్యూస్‌టుడే :

నల్లమల.. వన్యప్రాణుల కోవెల.. సమస్త ప్రాణుల సమాహారం.. జీవ వైవిధ్యానికి నిలయం.. పచ్చదనంతో కళకళలాడే ఈ అరణ్యం అరుదైన వృక్ష, గడ్డి జాతులకు ఆలవాలం. పెద్ద పులులకు అనువైన ఆవాస ప్రాంతంగా ప్రపంచ ఖ్యాతిగాంచింది. ఇక్కడ చేపట్టిన సంరక్షణ కార్యక్రమాలతో ఏటా వ్యాఘ్రాలు, చిరుతల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

అరుదైన, అంతరించిపోతున్న జంతు, పక్షి జాతులూ ఇక్కడ సందడి చేస్తుండటంతో నల్లమల ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ అభయారణ్యంలోని జీవ, వృక్ష జాతులు.. వాటి సంరక్షణకు చేపడుతున్న చర్యలు.. ప్రజల భాగస్వామ్యంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా అక్టోబరు మొదటి వారంలో అటవీ అధికారులు వన్య ప్రాణి సంరక్షణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దసరా సెలవుల్లో విద్యార్థులు జీవ వైవిధ్యంపై అవగాహన పెంపొందించుకునేందుకు ఇదే చక్కని అవకాశం. ఇక పదండి నల్లమలను చుట్టేద్దాం.!!


కూనలతో పెద్దపులి




బ్యాంబో పిట్ వైపర్, గ్రీన్ స్నేక్


బెట్టు ఉడుత


ప్యారడైజ్‌డ్ ఫ్లై క్యాచర్, అందమైన పక్షి


ఛేంజబుల్ హాక్ ఈగల్




షార్ట్ ఇయర్డ్ ఓవెల్

ఎకలాజికల్ నాలెడ్జ్ పార్క్

సున్నిపెంట జీవ వైవిధ్య కేంద్రం ఎదురుగా ఎనిమిది హెక్టార్లలో ఎకలాజికల్ నాలెడ్జ్ పార్క్ ఏర్పాటు చేశారు. భూమి పుట్టుక, జీవ పరిణామ క్రమం, కాలక్రమేణా సంభవించిన మార్పులపై అవగాహన కల్పించే చిత్రాలు, బొమ్మలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. వీటి సందర్శనకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం నాలుగు ప్రాంతాల్లో భోజనం, విడిది, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేశారు.

ఆవాసం.. ఆహార కల్పన చర్యలు

నల్లమలలో పులుల సంతతి క్రమేణా పెరుగుతోంది. ప్రస్తుతం నల్లమలలో పులుల సంతతి 85 చేరినట్లు అధికారులు గుర్తించారు. పులికూనలు తారసపడుతుండటంతో వీటి సంఖ్య భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 32 హెక్టార్లలో పచ్చిక మైదానాలు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వేట సమయంలో పులులకు హాని కలగకుండా గడ్డి మైదానాల్లో ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు తొలగించనున్నారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు గడ్డి మైదానాల చుట్టూ ఫైర్‌లైన్లు ఏర్పాటు చేయనున్నారు. నీటి కుంటలు, చెక్‌డ్యాంల ఏర్పాటు, సౌర విద్యుత్తుతో పనిచేసే బోర్ల ద్వారా నీటి సౌకర్యం కల్పించే పనులు చేపడుతున్నారు.

అరణ్యంపై అవగాహన

నల్లమల అభయారణ్యంలో పెద్దపులులు, చిరుతలు, కణితి, మనుబోతులు, చుక్కల దుప్పులు, నాలుగు కొమ్ముల జింకలు, కృష్ణ జింకలు, పెద్దనక్కలు, రేసుకుక్కలు, హైనా, ఎలుగుబంట్లు, అడవి పిల్లులు, అడవి పందులు, ఊసరవెల్లులు, నెమళ్లు, అరుదైన పక్షులు, రంగురంగుల సీతాకోక చిలుకలు ఉన్నాయి. వీటితో పాటు 300- 400 రకాల పక్షులు, 75 రకాల సరీసృపాలు, 80 రకాల క్షీరద జాతులు, వేలాదిగా క్రిమి కీటకాలు, అకసేరకాలు, 600 లకు పైగా వృక్ష జాతులు ఉన్నాయి. ఈ అభయారణ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. బైర్లూటి, పచ్చర్ల ఎకో టూరిజం ప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు మినీ డాక్యుమెంటరీ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

ఆదివారం ప్రత్యేకం

భావితరాల కోసం నిక్షిప్తం

కాలగమనంలో ఎన్నో జీవజాతులు అంతరించి పోతున్నాయి. వీటి గురించి భవిష్యత్తు తరాలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో 2001 డిసెంబరు 8న శ్రీశైలంలో జీవవైవిధ్య పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నల్లమలలోని వైవిధ్యమైన ప్రాణులను ప్రపంచానికి పరిచయం చేసేలా ఇక్కడ అనేక జీవరాశులను నిక్షిప్తం చేశారు. నల్లమలలో నివసించే జంతువులు, వాటి జీవన విధానాలు, కొత్త జీవరాశులను గుర్తించడం, వాటిని ప్రపంచానికి పరిచయం చేయటం వంటి పనులు ఈ కేంద్రం ద్వారా కొనసాగుతున్నాయి. ఇందులో 303 రకాల క్షీరదాలు, 80 రకాల పాములు, 102 రకాల సీతాకోక చిలుకలు, 55 రకాల చేపలు, 25 లాంబాలు, 18 కప్పలు, 54 రకాల సరీసృపాలు, 57 రకాల మాత్‌లు, 77 రకాల కీటకాలను భద్రపరిచారు.



నాన్న మార్చిన రాత

■ పట్టువీడని భరద్వాజ్
■ ఆదోని సబ్ కలెక్టర్ విజయగాథ

ఆటంకాలు ఎదురైనా..
వెనకడుగు వేయలేదు..!
లక్ష్య సాధనలో విఫలమైనా..
నిరుత్సాహపడలేదు!
అపజయాలు భయపెడుతున్నా..
ధైర్యంతో సమాధానం చెప్పారు..!
తోటివారు దాటిపోతున్నా..
సహనంతో ఎదురుచూశారు..!
లోపాలు అడ్డుపడుతున్నా..
అనుకూలంగా మలుచుకున్నారు.!
అనుకూల ఫలితాలు రాకపోయినా..
ప్రయత్నాలు విరమించలేదు..!
పట్టువీడక ఐఏఎస్ సాధించారు..
కొలువుతో లక్ష్యం చేరుకున్నారు.!

వేలు పట్టి నడిపించిన నాన్నే తన 'రాత' మార్చారని చెబుతున్నారు ఆదోని సబ్ కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్.



అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన సత్యప్రసాద్, రాధాకుమారి దంపతుల కుమారుడు మంత్రి మౌర్య భరద్వాజ్. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, తల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మాసిస్టుగా సేవలందిస్తున్నారు. భరద్వాజ్ భార్య కిరణ్మయి వైద్యురాలిగా పని చేస్తున్నారు. భరద్వాజ్‌ది చిన్నప్పటి నుంచీ కష్టపడే మనస్తత్వం. ప్రతి పరీక్షలో ఉత్తమ మార్కులు సాధిస్తూ ప్రశంసలు అందుకునేవారు. నర్సీపట్నంలో పదో తరగతి, వైజాగ్‌లో ఇంటర్, వరంగల్ ఎన్ఐటీ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం సాధించారు.

– న్యూస్‌టుడే, ఆదోని గ్రామీణం, ఆదోని ఎస్కేడి కాలనీ

దృష్టంతా ఐఏఎస్‌పైనే

మౌర్య భరద్వాజ్ బీటెక్ పూర్తి చేసిన తర్వాత హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కొలువు సాధించారు. ఆశించినంతగా తృప్తినివ్వలేదు. ప్రజలకు దగ్గరుండి సేవ చేయాలనే ఆలోచన మనసులో బలంగా నాటుకుంది. దీంతో ఐటీ ఉద్యోగం వదిలిపెట్టి తన అడుగులు ఐఏఎస్ వైపు వేశారు. దిల్లీ నగరానికి వెళ్లి అక్కడ సివిల్స్‌లో శిక్షణ తీసుకున్నారు. ఆ తర్వాత సివిల్స్ మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణత సాధించినా.. ర్యాంకు రాబట్టలేకపోయారు.

నైపుణ్యం పెరిగేలా సాధన

తన లోపాలు తెలుసుకున్నారు. సివిల్స్‌లో రాత నైపుణ్యం (రైటింగ్ స్కిల్స్)లో చాలా వెనుకబడినట్లు గుర్తించి, మెరుగుపరుచుకోవాలని నిర్ణయించుకున్నారు. తండ్రి సత్యప్రసాద్ దగ్గరుండి రోజూ రాత నైపుణ్యంపై సాధన చేయించారు. అలా తన రాతను మెరుగుపరుచుకున్నారు భరద్వాజ్. రెండు, మూడు ప్రయత్నాల్లో విజయం సాధించలేకపోయారు. మళ్లీ సాఫ్ట్‌వేర్ కొలువులో చేరారు. అయినా ఏదో తెలియని ఆందోళన వెంటాడుతూనే ఉంది. ఎలాగైనా సరే సివిల్స్ సాధించాలనే పట్టుదల మాత్రం వీడలేదు. ఓ వైపు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా రాణిస్తూనే మరోవైపు సివిల్స్ రాసేందుకు సాధన చేశారు. నాలుగోసారి కూడా అపజయం తప్పలేదు. అయినా నిరుత్సాహాన్ని దరిచేరనీయలేదు. ఐదోసారి సివిల్స్‌లో ఏకంగా 28వ ర్యాంకు సాధించి అందరితో ప్రశంసలు అందుకున్నారు. 2022వ బ్యాచ్‌కు చెందిన ఈయన ఏడాదిపాటు ముస్సోరిలో శిక్షణ తీసుకున్నారు. ఆ తర్వాత కడపలో శిక్షణ సహాయ కలెక్టర్‌గా పని చేశారు. అనంతరం మొదటి పోస్టింగ్ కింద ఆదోని సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

వైఫల్యాలను మనమే భయపెట్టాలి : మంత్రి మౌర్య భరద్వాజ్, సబ్ కలెక్టర్, ఆదోని

లక్ష్య సాధనలో ఎదురయ్యే వైఫల్యాలను చూసి మనం భయపడకూడదు.. మన పట్టుదలను చూసి అవే భయపడాలి. మనసు చెప్పిందే వినాలి. ఎంచుకునే దారి ప్రజలకు మేలు చేసేదై ఉండాలి. అపజయాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా లోపాలు తెలుసుకోవాలి. వాటిని అధిగమించి అనుకున్న లక్ష్యం సాధించాలి. అమ్మానాన్న నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. నిరుత్సాహం దరిచేరకుండా కొండంత ధైర్యాన్నిచ్చారు. ఐఏఎస్ కావాలనే కల నెరవేరింది. ప్రజలకు మేలు చేసే బాధ్యత నాముందుంది. జిల్లాలో పశ్చిమ ప్రాంతం వెనుకబడుంది. వలసలు, నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేస్తా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకనుగుణంగా పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తా.

పారిశ్రామిక వాడకు పట్టాలు

■ కొత్త రైల్వే లైన్‌కు ప్రతిపాదన
■ రెండు జిల్లా కేంద్రాల అనుసంధానం



ఈనాడు, కర్నూలు: ఓర్వకల్లు పారిశ్రామికవాడ అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక చొరవ తీసుకొంది.. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు సరకు రవాణా చేయడానికి వీలుగా కర్నూలు నుంచి నంద్యాల వరకు ఓర్వకల్లు మీదుగా కొత్త రైలు మార్గం ప్రతిపాదనకు ఆ శాఖ అధికారులు సానుకూలత వ్యక్తం చేశారు. కల్లూరు మండలం దూపాడు నుంచి నన్నూరు, ఓర్వకల్లు, సోమయాజులపల్లె, హుస్సేనాపురం, కాల్వబుగ్గ మీదుగా సిమెంట్ నగర్ వరకు కొత్త రైల్వేలైన్ నిర్మించే అవకాశం ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించిన రైల్వే అంశాలపై విజయవాడలో దక్షిణమధ్య రైల్వే జీఎం సమీక్షించారు.

● గతంలో కర్నూలు నుంచి మచిలీపట్నం వరకు నడిచిన రైలుసర్వీసు స్థానంలో కర్నూలు నుంచి విశాఖ వరకు నడిచేలా సర్వీసు ఉంటే బాగుంటుందని చర్చించారు.. దీని ద్వారా రాయలసీమ, దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తాలోని పలు ప్రాంతాలు అనుసంధానమవుతాయని ఎంపీ బస్తిపాటి నాగరాజు రైల్వే అధికారులకు తెలిపారు.

● కర్నూలు నుంచి మంత్రాలయం వరకు కొత్త రైల్వేలైను ఏర్పాటు చేయాలి దీని ద్వారా మంత్రాలయం వెళ్లే భక్తులకు అనుకూలంగా ఉండటంతో పాటు కర్నూలు నుంచి ముంబయికి వెళ్లడానికీ ప్రయోజనకరమని ఎంపీ ప్రస్తావించారు. ఎమ్మిగనూరు, ఆదోని పరిసర ప్రాంతాల వాసులు ముంబయికి రాకపోకలు సాగిస్తుండటంతో ఎంతో ప్రయోజనమని భావిస్తున్నారు.

● కర్నూలు-మంత్రాలయానికి కొత్త రైల్వే మార్గం ఏర్పాటు భారీ వ్యయంతో కూడుకున్నది కావడంతో సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కోసిగి, మద్దికెర, తుగ్గలి స్టేషన్లలో గతంలో కొన్ని రైళ్లను ఆపేవారని, కొవిడ్ అనంతరం ఆయా స్టేషన్లలో కొన్నింటిని నిలపకపోవడంతో ఆయా ప్రాంతాల వాసుల ఇబ్బందులపైనా చర్చించారు.

● కర్నూలు శివారు పంచలింగాలలో 'కోచ్ మిడ్‌లైఫ్ రీహాబిలిటేషన్ వర్క్‌షాప్' నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్న విషయాన్ని ఎంపీ నాగరాజు జీఎం దృష్టికి తీసుకెళ్లగా... వచ్చే ఏడాది నాటికి ఆ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

రావణ వాహనంపై
త్రినేత్రుడి విహారం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : అష్టాదశశక్తిపీఠం శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు సందడిగా కొనసాగుతున్నాయి. మూడోరోజైన శనివారం భ్రమరాంబాదేవి చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సర్వాంగ సుందరంగా ముస్తాబైన వేదికపై చంద్రఘంటాదేవి చంద్రవంకను శిరస్సున ఆభరణంగా ధరించి, యుద్ధోన్ముఖురాలి రూపంలో భక్తులకు సాక్షాత్కరించారు. సుగుణాలను ప్రసాదించే దుర్గమ్మగా పేరుగాంచిన చంద్రఘంటాదేవిని ఆలయ అర్చకులు సుగంధ, పసుపు, కుంకుమలతో అర్చనలు చేసి మంగళహారతులు సమర్పించారు. స్వామిఅమ్మవార్లు రావణ వాహనాధీశులై పూజలందుకున్నారు. ఆలయ ప్రధాన పురవీధుల్లో శ్రీస్వామిఅమ్మవార్లకు శోభాయమానంగా గ్రామోత్సవం జరిగింది. ఆలయ దక్షిణ మాడవీధిలో కేరళ నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కేరళ సంప్రదాయ నృత్యాలు థయ్యం, విళక్కు నృత్యాలు ప్రదర్శించి కళాకారులు మంత్రముగ్ధులను చేశారు. కథక్, కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి. ఈవో డి.పెద్దిరాజు, ఆలయ అధికారులు స్వామివార్లకు నారికేళాలు సమర్పించారు.

కొలువుదీరిన స్వామి అమ్మవారు



గ్రామోత్సవానికి తరలివస్తున్న స్వామిఅమ్మవారు


శివుడి వేషధారణలో..

శ్రీశైలంలో నేడు

నాలుగో రోజు ఆదివారం రాత్రి 7 గంటలకు భ్రమరాంబాదేవి భక్తులకు కూష్మాండ దుర్గ అలంకారంలో దర్శనమివ్వనున్నారు. శ్రీస్వామిఅమ్మవార్లకు కైలాస వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.

2 గంటలు నిలిచిన డెమో

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : పాణ్యం రైల్వేస్టేషన్‌లో నంద్యాల డోన్ డెమో రైలు సుమారు రెండు గంటల పాటు ఆగింది. శనివారం ఉదయం నంద్యాల నుంచి డోన్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు పాణ్యం దాటిన తర్వాత కృష్ణమ్మకొన సమీపంలో ఇంజిన్‌లో సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. దీంతో నంద్యాల- డోన్ మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. డోన్ డెమో ఉదయం 7 గంటలకు నంద్యాల నుంచి పాణ్యం చేరుకుంది. ఇక్కడి డోన్ వెళ్లడానికి లైన్ లేకపోవడంతో పాణ్యం స్టేషన్‌లోనే నిలిపేశారు. మరమ్మతులు చేసి పంపిన తర్వాత డెమో రైలు 9 గంటల సమయంలో బయల్దేరి వెళ్లిందని పాణ్యం రైల్వే స్టేషన్ మాస్టర్ మితున్‌కుమార్ తెలిపారు.

ఆరువేల క్యూసెక్కుల విడుదల

అవుకు, న్యూస్‌టుడే: అవుకులో జలాశయానికి భారీగా వరద చేరుతోంది. జలాశయంలో గరిష్ఠ స్థాయి 3.5 టీఎంసీలు నిల్వ ఉంచామని, అదనపు నీటిని గాలేరు-నగరి కాలువ గేట్లు తెరచి గండికోట జలాశయానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం అవుకు జలాశయంలో 3.5 టీఎంసీలు నిల్వ ఉన్నాయని, ఎగువ నుంచి జలాశయానికి ఐదువేల క్యూసెక్కులు వస్తున్నాయని, ఆరువేల క్యూసెక్కులు దిగువన గండికోట జలాశయానికి పంపుతున్నట్లు జలాశయం ఈఈ సురేష్ బాబు తెలిపారు.

సెలవికా

■ ఆడుకుంటూ అనంతలోకాలకు
■ వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

దసరా సెలవులొచ్చాయి.. అల్లరి చేశారు.. ఆటలు ఆడారు.. నవ్వులతో మురిపించారు.. సెలవుల్లో సరదాగా గడుపుతున్న నలుగురు చిన్నారులను మృత్యువు కబళించింది.. బహిర్భూమికి వెళ్లిన ముగ్గురు చిన్నారులు ఆడుకుంటూ నీటికుంటలో మునిగిపోయారు.. సీసాలో ఉన్న ద్రావణం తాగేదని పురుగు మందు తాగిన ఇద్దరు చిన్నారుల్లో ఒకరు మృతి చెందగా, మరొకరు చికిత్స పొందుతున్నారు. రెండు గ్రామాల్లో శనివారం జరిగిన ఈ ఘటనలు తీవ్ర విషాదం నింపాయి.

ద్రావణమని పురుగుల మందు తాగి...

ఎమ్మిగనూరు మండలం కె.నాగలాపురానికి చెందిన బాలురు మహిరాం, హరికృష్ణ ఒకే వీధిలో ఉంటున్నారు. శనివారం ఆడుకుంటున్నారు. పంటలకు పిచికారీ చేసేందుకు తెచ్చిన పురుగు మందు డబ్బాను ఇంట్లోంచి బయటకు తెచ్చారు. తాగే ద్రావణమని భావించి మూత తీసి ఇద్దరూ తాగారు. అస్వస్థతకు గురవడంతో గమనించిన బంధువులు చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహిరాం (5) మృతి చెందగా, హరికృష్ణ పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తీసుకెళ్లారు. మహిరాం తండ్రి కాశీం గతంలోనే చనిపోగా తల్లి జయలక్ష్మి కూలీ పనులు చేస్తూ పోషిస్తోంది. హరికృష్ణ తండ్రి మహేశ్ బతుకుదెరువుకు హైదరాబాద్ వెళ్లారు.



కన్నీరొలికిన కుంట

నందవరం మండలం మాచాపురానికి చెందిన నలుగురు విద్యార్థులు శనివారం బహిర్భూమికి వెళ్లారు.. తర్వాత పక్కనే నీటికుంట వద్దకు వెళ్లగా హనుమేష్ (6), ఉదయ్‌కుమార్ (11)లు ప్రమాదవశాత్తు కుంటలో జారి పడ్డారు. వెంటనే మిగిలిన ఇద్దరూ గ్రామానికి వెళ్లి పెద్దలకు సమాచారం ఇచ్చారు.. వారంతా వచ్చి వెతికేలోపు ఇద్దరు చిన్నారులు మృత్యుఒడికి చేరారు. వీరిద్దరూ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారు. గ్రామంలో ఇద్దరు చిన్నారులు చనిపోవడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు జయమ్మ, భీమేష్, ఉరుకుందమ్మ, నడిపి రంగస్వామి రోదనలు మిన్నంటాయి.

అమ్మమ్మ ఊరొచ్చి..

ఎమ్మిగనూరు మండలం ఎస్.నాగలాపురానికి చెందిన సంపత్‌కుమార్ (12) తల్లితో కలిసి అమ్మమ్మ గ్రామమైన పార్లపల్లికి వచ్చాడు. శనివారం స్నేహితులతో కలిసి ఆడుకుంటూ గ్రామ సమీపంలోని వంక వద్దకు వెళ్లాడు. అక్కడ బహిర్భూమికి వెళ్లి తర్వాత వంకలోకి దిగారు. నీళ్లు ఎక్కువగా ఉండటంతో అందులో మునిగి చనిపోయాడు. 'చిన్నోడా బాగా చదువుతానంటివి.. ఉన్నతంగా రాణిస్తానంటివి.. అంతలోనే మాకు అందకుండా పోతివా" అంటూ తల్లిదండ్రులు శాంతికుమారి, మాణిక్యం రోదనలు మిన్నంటాయి.



–ఎమ్మిగనూరు గ్రామీణం, నందవరం

టెట్‌కు 121 మంది గైర్హాజరు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని అయ్యలూరి మెట్ట వద్ద ఉన్న ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) శనివారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షలకు ఉదయం 455 మందికి గాను 69, సాయంత్రం 455 మందికి 52 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద గ్రామీణ సీఐ అస్రార్‌బాషా ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాజోలి ఆనకట్ట పరిశీలన

రాజోలి(చాగలమర్రి), న్యూస్‌టుడే: రాజోలి ఆనకట్టను డీఈ పుల్లయ్య శనివారం పరిశీలించారు. ఆనకట్ట వద్ద కుందూ ప్రవాహాన్ని, కేసీ ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజోలి ఆనకట్ట వద్ద కుందూ 9 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉందన్నారు. దిగువన కేసీ కాలువకు 200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందన్నారు. ఏఈ జమాల్‌వలి, సిబ్బంది దస్తగిరి పాల్గొన్నారు.

మల్లన్నసేవలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దంపతులు దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ మహాద్వారం వద్ద దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు సాదర స్వాగతం


స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దంపతులు

పలికారు. అనంతరం న్యాయమూర్తి కుటుంబ సమేతంగా శ్రీస్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలను నిర్వహించుకున్నారు.

గంజాయి స్వాధీనం వ్యక్తి అరెస్ట్

మహానంది : మండలంలోని అయ్యన్ననగర్ వద్ద ఉన్న ఓ వ్యక్తి నుంచి 2.114 కేజీల గంజాయిని శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి తెలిపారు. శిరివెళ్ల మండలం మహదేవపురం గ్రామానికి చెందిన సునీల్‌కుమార్ అరకు నుంచి పార్సిల్‌లో గంజాయిని తెప్పించుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన మద్దిలేటి, బోయిలకుంట్ల గ్రామానికి చెందిన రామచంద్రుడులకు ప్రమేయం ఉన్నట్లు గుర్తించాము. సునీల్‌ని అరెస్టు చేశామని, త్వరలోనే మరో ఇద్దరిని పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

కలిసిరావాలని.. లాభాలు పొంగాలని

■ పేరుబలం చూసుకుని మరీ దరఖాస్తు
■ మద్యం దుకాణాలకు పెరుగుతున్న పోటీ

కర్నూలు, నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లాలో మద్యం దుకాణాలకు సంబంధించి అనుమతుల దరఖాస్తుల నమోదు ప్రక్రియలో వేగం పెరిగింది. పలువురు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆశావహులు దరఖాస్తు చేసుకుంటున్న తీరు గమనిస్తే ఎక్కువగా సెంటిమెంటుకు ప్రాధాన్యమిస్తున్నట్లు కనపడుతోంది. మద్యం అనుమతుల దరఖాస్తు ప్రక్రియ నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పూజారులు, జ్యోతిష్యుల సందడి ఎక్కువగా ఉంది. దరఖాస్తుదారులు తమ కుటుంబంలో ఎవరి పేరున బలం ఉంది.. ఎవరి రాశి ఫలితం ఎలా ఉంది.. ఎవరి పేరుతో వ్యాపారం చేస్తే బాగా కలిసి వస్తుందో అడిగి తెలుసుకుంటున్నారు. ఏ రోజున దరఖాస్తు చేసుకోవాలి.. ఏ సమయంలో చేస్తే మంచిదో ముహూర్తాలు తెలుసుకుని మరీ దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఎప్పటినుంచో ఇదే సెంటిమెంటుతో కొందరు వ్యాపారులు, రాజకీయ నాయకులు తమ కుటుంబసభ్యుల పేర్లతో మద్యం అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటున్న సంగతి విదితమే. ప్రస్తుతం కర్నూలులో పలు బార్ల అనుమతులు మహిళ పేర్లపై ఉండటమే ఇందుకు నిదర్శనం. కర్నూలు ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉండే ఓ హోటల్ యజమాని ఎప్పటి నుంచో తన కుటుంబసభ్యురాలి పేరుతో మద్యం వ్యాపారం సాగిస్తున్నారు. పెట్టుబడితో కూడిన వ్యాపారం కావటంతో కులమతాలకతీతంగా చాలామంది మంది సెంటిమెంటు అనుసరిస్తున్నారు.

తెలంగాణ, కర్ణాటక నుంచి రాక

జిల్లాలో మద్యం వ్యాపారం చేసేందుకు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పలువురు తరలివస్తున్నారు. గద్వాల జిల్లా, హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు కర్నూలు నగరంలో మద్యం దుకాణాలు ఏర్పాటుచేసే ఉద్దేశంతో దరఖాస్తు చేసుకునే విధానం అడిగి తెలుసుకుంటున్నారు. ఏ దుకాణానికి దరఖాస్తు చేసుకుంటే వ్యాపారం బాగుంటుందో స్థానికులతో చర్చిస్తూ ఆరా తీస్తున్నారు. ఆదోని, ఆలూరు, కోసిగి ప్రాంతాల్లో మద్యం దుకాణాల అనుమతుల కోసం కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యాపారులు ప్రయత్నాలు చేస్తున్నారు. 5వ తేదీ సాయంత్రం వరకు ఆఫ్‌లైన్ ద్వారా పరిశీలిస్తే జిల్లావ్యాప్తంగా 99 దుకాణాలకుగాను 128 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్ధతుల ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలు చివరిరోజైన 9వ తేదీన వెల్లడికానున్నాయి.



కర్నూలు స్టేషన్ వద్ద మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ ఫ్లెక్సీ

స్టేషన్	మద్యం దుకాణాలు	ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు
నంద్యాల	24	54
బనగానపల్లి	12	7
నందికొట్కూరు	10	4
డోన్	16	14
ఆళ్లగడ్డ	19	3
కోవెలకుంట్ల	11	11
ఆత్మకూరు	13	5

22 దుకాణాలకు సున్నా దరఖాస్తులు

కర్నూలు జిల్లాలో 99 మద్యం దుకాణ అనుమతులకు సంబంధించిన దరఖాస్తుల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రభుత్వం గోప్యంగా ఉంచింది. శనివారం వరకు 77 దుకాణాలకు మాత్రమే దరఖాస్తులు అందాయి. ఐదు రోజులు గడిచినా 22 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉండటంతో దరఖాస్తులు వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. నంద్యాల జిల్లాలో 5వ తేదీ సాయంత్రం వరకు ఆఫ్‌లైన్ ద్వారా పరిశీలిస్తే జిల్లావ్యాప్తంగా 105 మద్యం దుకాణాలకుగాను 98 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్ధతుల ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలు చివరిరోజైన 9వ తేదీన వెల్లడికానున్నాయి.

అహోబిలంలో ఘనంగా స్వాతి వేడుకలు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను అద్దాల మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి హోమగుండం ఏర్పాటు చేశారు. హోమంలో పాల్గొనే భక్తులకు కంకణధారణ చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు ఎదురుగా హోమగుండంలో స్వాతి సుదర్శన హోమం జరిపారు. రెండు గంటల పాటు ఏకధాటిగా సాగిన హోమాన్ని తిలకించిన భక్తులు గోవింద నామస్మరణ చేశారు. హోమం నుంచి వెలువడిన కాటుకను స్వీకరించి స్వామిని అర్చించారు. అర్చకులు స్వామి, అమ్మవార్లకు మహా మంగళహారతి అందించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.


ప్రత్యేక అలంకరణలో ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి


సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

చెంచులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా, కలెక్టర్ రాజకుమారి

ఆత్మకూరు, వెలుగోడు, న్యూస్‌టుడే : ప్రతి చెంచు కుటుంబం నుంచి ఒక అధికారి తయారవ్వాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొట్టాల చెరువులో శనివారం ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం ద్వారా మంజూరైన వసతి గృహాల నిర్మాణానికి కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కొట్టాల చెరువులో రూ.2.30కోట్లు, వెలుగోడులో రూ.2.70కోట్లతో వసతి గృహాలను నిర్మించనున్నారు. బుడ్డారాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు 5వసతి గృహాలను మంజూరు కాగా మొదటి విడతలో రెండు ప్రారంభిస్తున్నామన్నారు. కొట్టాల చెరువులో 50, వెలుగోడులో 100 పడకల వసతి గృహాలను మంజూరయ్యాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకోని గిరిజన కుటుంబం జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరి జీవనోపాదులు పెరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యతోనే చెంచుల అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. మొట్టమొదటగా నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చెంచుల అభివృద్ధి కోసం ఐటీడీఏను స్థాపించారని గుర్తుచేశారు. పిల్లలు చదువుకునేందుకు తల్లిదండ్రులు అన్ని విధాలుగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దాసు, డీఈఓ సుధాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష అభియాన్ ఈఈ రఘురామిరెడ్డి, తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు అన్నారపు శేషిరెడ్డి, ఖలీలుల్లాఖాన్, ఎంపీపీ తిరుపాలమ్మ, సర్పంచి నాగలక్ష్మి, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


వెలుగోడులో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా, కలెక్టర్ రాజకుమారి

పోటీ ఎక్కడైనా పతకమే!

◆ క్రికెట్‌లో జంషీర్ సత్తా ◆ ఈ ఏడాది చివరలో నేపాల్ పోటీలకు సాధన

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని ఇంజేటి కమాల్‌వలి, బీబీ దంపతుల కుమారుడు జంషీర్ రాష్ట్ర, జాతీయస్థాయి క్రికెట్‌లో రాణిస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. తల్లిదండ్రులు సాధారణ కూలీ పనులు చేస్తూ కుమారుడి ఆసక్తిని గమనించి ఎంతగానో ప్రోత్సహించారు. కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని జంషీర్ ఒకవైపు చదువులోనూ రాణిస్తూ, మరోవైపు ఆటల్లోనూ రాణిస్తున్నారు. భవిష్యత్తులో ఐపీఎల్, దేశ క్రికెట్ జట్టులో ఆడేందుకు ప్రయత్నిస్తున్నట్లు జంషీర్ చెబుతున్నారు.

విద్యార్థి దశ నుంచే..

చాగలమర్రి పట్టణానికి చెందిన జంషీర్ విద్యార్థి దశ నుంచి క్రికెట్‌పై మక్కువతో పలు పాఠశాలల దశల్లో జరిగిన పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. అనంతపురం జిల్లాలో పీవీకేకేఐటీ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న సమయంలో పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయిలో రెండుసార్లు ప్రశంసాపత్రాలు దక్కించుకున్నారు. అనంతపురం ఆర్డీటీలో నిర్వహించిన పలు పోటీల్లోనూ రాణించారు.


జంషీర్, జాతీయస్థాయి క్రీడాకారుడు, చాగలమర్రి

జాతీయస్థాయికి ఇలా!

2024 జనవరిలో నంద్యాలలో సూపర్-7 క్రికెట్ పోటీల్లో పాల్గొని జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 15నుంచి 17 వరకు కర్నూలు జిల్లా మద్దికెరలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జట్టును ద్వితీయ స్థాయిలో నిలిపారు. ఆయన ప్రతిభను గుర్తించి జాతీయస్థాయికి ఎంపిక చేశారు. ఈ ఏడాది జులైలో హరియాణాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటి సూపర్-7 క్రికెట్ పోటీల్లో ప్రశంసా పత్రాన్ని అందుకుని అంతర్జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ ఏడాది చివరిలో నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి సూపర్-7 జాతీయ జట్టు తరఫున నేపాల్‌లో ఆడనున్నట్లు తెలిపారు.

జల జీవన్ పనులపై విచారణ


విచారిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలోని కరిమద్దెల గ్రామంలో జల జీవన్ పథకం కింద చేపట్టిన పనులపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్ శనివారం విచారణ చేపట్టారు. గ్రామంలో జరిగిన పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఈ విచారణ చేపట్టారు. ఇక్కడ జల్ జీవన్ పథకం కింద గ్రామంలో ఎలాంటి పనులు చేయలేదని ఫిర్యాదుదారులు తెలిపారు. పనులు చేసినట్లు, కుళాయిలు వేసినట్లు ఎన్ఎంఆర్ నమోదు చేశారని ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌కే తండాలో తాగునీటి సమస్య ఉందని ఎంపీ శబరి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎస్‌ఈ తండాలో పర్యటించారు. జల జీవన్ పథకం ద్వారా రూ.60 లక్షలు కేటాయించారని, టెండర్లు పూర్తయిన తర్వాత పనులు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఈ శివమోహన్, ఏఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఓ మోస్తరు వర్షం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లాలో శనివారం తెల్లవారుజాము నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా ఆత్మకూరు మండలంలో 70.2 మి.మీ, అత్యల్పంగా చాగలమర్రిలో 2 మి.మీ వర్షపాతం నమోదైంది. శ్రీశైలం, ఆళ్లగడ్డ, దొర్నిపాడు, ఉయ్యలవాడ మినహా అన్ని


కొండజూటూరు– పోలూరు రహదారిపై ప్రవహిస్తున్న వర్షంనీరు

మండలాల్లో వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో పొలాల్లో నీరు నిలిచింది. . పాణ్యం మండలం కొండజూటూరు-పోలూరు రహదారిలో పెద్దకప్పల వాగు రహదారిపై ప్రవహించింది. వెలుగోడు 51.2 మి.మీ, కోవెలకుంట్ల 43.2, పాములపాడు 41.0, ప్యాపిలి 32.0, నంద్యాల 27.8, పాణ్యం 25.6, నందికొట్కూరు 19.2, మిడుతూరు 18.6, గోస్పాడు, గడివేముల 16.2, మహానంది 13.8, రుద్రవరం 13.6, జూపాడుబంగ్లా 11.2, ఆత్మకూరు 10.4, పగిడ్యాల 8.0, కొలిమిగుండ్ల, డోన్ 7.0, శిరివెళ్ల 6.0, సంజామల 3.8, కొత్తపల్లి 3.6, బనగానపల్లి 3.4, బేతంచెర్ల, అవుకు 3.2 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

అన్నదాతలను ముంచిన వాన

నందికొట్కూరు గ్రామీణం, గడివేముల, న్యూస్‌టుడే : అకాల వర్షంతో అన్నదాతలకు తీవ్ర నష్టం మిగిల్చింది. దిగుబడులు పలు ప్రాంతాల్లో నీట మునిగాయి. పాములపాడు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు మండలాల్లో శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మొక్కజొన్న దిగుబడులు తడిసిపోయాయి. పాములపాడు మండలం వేంపెంటలో పట్టలు కప్పిపెట్టిన మొక్కజొన్నలు వాననీటిలో కొట్టుకుపోయాయి. జూపాడుబంగ్లా మండలం పారుమంచాల సమీపంలో మైదానంలో ఆరబెట్టిన దిగుబడులు తడిసిపోయాయి.


పారుమంచాలలో నీట మునిగిన విత్తనాలను సేకరిస్తున్న చిన్నారులు


మునిగిన సోయాబీన్ దిగుబడిని బయటికి తరలిస్తున్న రైతులు

☛ కరిమద్దెల గ్రామంలో సుమారు 500 ఎకరాల్లో సోయాబీన్ పంట సాగుచేశారు. ప్రస్తుతం పంట కోత దిగుబడులను కల్లాల్లో ఆరబెట్టారు. శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి దిగుబడుల చుట్టూ నీరుచేరి తడిసిపోయాయి. ప్రస్తుతం క్వింటా సోయాబీన్ రూ.4400 ధర ఉందని, నీటిలో తడవడం వల్ల సగం రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెసరవాయి గ్రామంలో కల్లాల్లో ఆరబెట్టిన పంట నీటిలో మునిగిపోయింది.

దొర్నిపాడు, న్యూస్‌టుడే: దొర్నిపాడు మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల లోపు భారీగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మినుము, పత్తి, మిరప, జొన్న నీట మునిగాయి.


డబ్ల్యూ కొత్తపల్లెలో వర్షానికి మునిగిన జొన్న

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సంజామల, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గిద్దలూరులో జరిగిందని శనివారం పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన పల్లి సుబ్బరాయుడు (35) ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పాటు మతిస్థిమితం లేక తిరిగేవాడని, ఈ నెల 4న ఇంట్లో చీరతో పంకాకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఆయనకు భార్య సుబ్బలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణారెడ్డి వెల్లడించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన యుగంధర్‌బాబు



మంత్రి ఫరూక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఎస్పీ యుగంధర్‌బాబు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల ఏఎస్పీగా యుగంధర్‌బాబు బాధ్యతలు చేపట్టారు. నంద్యాల డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన ఏఎస్పీగా పదోన్నతి పొందారు. నంద్యాలలో ఏఎస్పీ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆయన్ను ఇక్కడే నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణాను మర్యాదపూర్వకంగా కలిశారు. అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రేపటి నుంచి స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నుంచి బీఎస్సీ, బీఏ, బీకాం కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రిన్సిపల్ డా. ఎన్. శశికళ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ అసలు ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలని ఆమె శనివారం సూచించారు. ఇతర వివరాలకు 9948603176 నంబరులో సంప్రదించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల రైతునగరం : **సమస్య :** పట్టణంలోని నౌమాన్‌నగర్, అబ్దుల్లా గ్రీన్ సిటీలలో కోతుల బెడద అధికంగా ఉంది. **- సలాంఖాన్, స్థానికుడు**

సమస్య : ఎంఎస్‌నగర్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- రమణ, స్థానికుడు**

సమస్య : సాయిబాబానగర్‌లో కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. **- పవన్‌కుమార్, స్థానికుడు**

సమస్య : చాంద్‌బాడాలో వీధికుక్కలు అధికంగా ఉన్నాయి. బయటికి వెళ్లాటంలే భయంగా ఉంది. **- నూర్, స్థానికుడు**

సమాధానం : కాల్వలు శుభ్రం చేయిస్తాం. త్వరలోనే కుక్కలు, కోతులను పట్టించి సమస్య పరిష్కరిస్తాం. **- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పంట నష్టంపై విచారణ



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో మల్లికార్జునరెడ్డి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని పిన్నాపురం గ్రామంలో గ్రీన్‌కో సంస్థ పంటను ధ్వంసం చేసిన ఘటనపై విచారణ చేపట్టినట్లు ఆర్డీవో మల్లికార్జునరెడ్డి తెలిపారు. పాణ్యం తహసీల్దారు కార్యాలయంలో శనివారం రైతులు, గ్రీన్‌కో సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. గ్రీన్‌కో సంస్థకు 2.25 ఎకరాల పొలాన్ని విక్రయించిన ఓ రైతు దానిని మరొకరికి కౌలుకు ఇచ్చాడన్నారు. దీంతో కౌలు రైతు అందులో కంది సాగు చేయగా గ్రీన్‌కో సంస్థ వారు దారి కోసం 25 సెంట్లలో పంటను ధ్వంసం చేసిందన్నారు. మిగతా పొలాల్లోనూ ఇలాగే చేస్తే నష్టపోతామని, తమకు పంట నష్టం ఇవ్వాలని రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించడంతో విచారణ చేపట్టినట్లు ఆర్డీవో వివరించారు. రైతులు, గ్రీన్‌కో సంస్థ ప్రతినిధులను విచారించి వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

చిరుత సంచారంతో ఆందోళన

ఆత్మకూరు, న్యూస్‌టుడే : కొట్టాల చెరువు గూడెం నుంచి వరదరాజస్వామి ప్రాజెక్టుకు వెళ్లే దారిలో శనివారం చిరుత సంచరించినట్లు స్థానికులు తెలిపారు. మరికొందరు పెద్దపులి సంచరించినట్లు చెబుతున్నారు. ఈ విషయంపై అటవీ అధికారులు మాట్లాడుతూ నల్లమల అటవీ పరిధిలో చిరుతలు, పులులు సంచరించడం సహజమేనని చెప్పారు. అనుమతి లేకుండా ఎవరూ కూడా టైగర్ ప్రాజెక్టువైపు వెళ్లకూడదని సూచించారు.

ఆక్రమణలు తొలగక.. ఆత్మకూరు మునక

☛ భారీ వర్షాలు కురిస్తే కాలనీలు జలమయం

☛ యథేచ్ఛగా గుండ్లకమ్మ కాల్వ కబ్జా

ఈ భవనం ఏకలవ్యనగర్‌లో ఉంది. దీనిని గుండ్లకమ్మ వాగుకు అవతలివైపు నిర్మించారు. అక్కడికి వెళ్లాలంటే కాల్వను దాటాలి. ఇందుకోసం ఎలాంటి అనుమతులు లేకుండానే వాగుపై కాంక్రీటుతో పెద్ద వంతెన నిర్మించుకున్నారు. దీంతో వాగు ఇరుకుగా మారి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీంతో వరదనీరు సాయిబాబానగర్, ఏకలవ్యనగర్‌లను ముంచెత్తుతోంది.



ఈ ప్రాంతం ఆర్డీటీకాలనీకి వెళ్లే మార్గంలో ఉంది. పట్టణం లోని కాల్వల ద్వారా వచ్చే వరద నీరంతా భవనాశి వాగులో కలుస్తుంది. ఈ ప్రాంతానికి అవతలివైపున ఓ స్థిరాస్తి వ్యాపారి ప్లాట్లు వేశారు. ఆ ప్లాట్లకు వెళ్లేందుకు దారి లేదు. దీంతో కాల్వలో రెండు చిన్న సిమెంటు పైపులు వేసి దారి ఏర్పాటు చేశారు. దీనివల్ల కాల్వ పూడిపోయింది. నీళ్లన్నీ వెనక్కు వెళ్తున్నాయి. గరీబ్‌నగర్, ఇందిరానగర్‌లలో పెద్దఎత్తున నీరు నిలుస్తోంది. పైపులు ఏర్పాటు చేసే సమయంలో పలువురు ఫిర్యాదు చేసినా పట్టణ ప్రణాళిక అధికారులు పట్టించుకోలేదు.



ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి ఆత్మకూరు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. పట్టణం మీదుగా ప్రవహించే గుండ్లకమ్మ వాగు ఆక్రమణ తొలగింపుపై అధికారులు, పాలకవర్గం దృష్టిపెట్టక పోవడం లేదు. పుర పాలకవర్గం వద్ద ముంపు సమస్యను ఎదుర్కొనేందుకు ఎలాంటి ప్రణాళిక లేకపోవడం ప్రజల పాలిట శాపంగా మారింది. దీంతో వర్షాకాలంలో ఆత్మకూరు వాసులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

వానొస్తే వేదనే

పట్టణంలో భారీ వర్షం కురిస్తే ఏకలవ్యనగర్, సాయిబాబానగర్, రహ్మత్‌నగర్, ఇందిరానగర్, సాయిబాబానగర్, గరీబ్‌నగర్, అక్కిరాజు కాలనీ, హుసేన్‌నగర్ కాలనీల్లో రోజుల తరబడి ఇళ్ల మధ్య నీళ్లు నిలుస్తున్నాయి. ఈ కాలనీల గుండా ప్రవహించే గుండ్లకమ్మ వాగును ఆక్రమించి ఇళ్ల ముందు మెట్లు, ప్రహరీలు, మోరీలు నిర్మించారు. దీంతో వరదనీరు రహదారులపై ప్రవహిస్తోంది. రోజురోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నా పట్టణ ప్రణాళిక అధికారులు పట్టించుకోవడం లేదు.



ఇది రహ్మత్‌నగర్‌లోని గుండ్లకమ్మ కాల్వ. ఇరువైపులా ఆక్రమించి ఇళ్ల ప్రహరీలు, మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. దీంతో వరదనీరు కాలనీలను ముంచెత్తుతోంది. రహ్మత్‌నగర్‌తో పాటు అక్కిరాజుకాలనీ, హుసేన్‌నగర్‌లో సైతం ఇలాగే కాల్వను ఆక్రమించి కట్టడాలు చేపట్టారు. దీనివల్ల వాగు కుచించుకుపోయి వరదనీరు లోతట్టు ప్రాంతాలైన ఏకలవ్యనగర్, అక్కిరాజు కాలనీల్లో ఇళ్లను చుట్టుముడుతున్నాయి. రోజుల తరబడి ఇళ్లల్లో నీరు నిలవడంతో ప్రజలు వంట చేసుకోవాలన్నా సాధ్యం కావడం లేదు. దాతలు అందించే ఆహారంతో ఆకలి తీర్చుకోవాల్సిన దుస్థితి తలెత్తుతోంది. పట్టణ ప్రణాళిక అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించి ముంపు ముప్పును తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వాగు పొంగితే.. రాకపోకలకు వ్యథే



పాములపాడు మండలంలో శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి వేంపెంట నుంచి వెలుగోడు వెళ్లేదారిలో ఉన్న గుండ్లవాగు పొంగి రహదారిపైకి ప్రవహించింది. దీంతో ఈ రహదారిలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ మార్గంలో ఆత్మకూరు, పాములపాడు మండలాల ప్రజలు వెలుగోడు మీదుగా నంద్యాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇక్కడ వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

అన్నపూర్ణా నమోస్తుతే



ఆత్మకూరు : వేంకటేశ్వర స్వామి అలంకరణలో కన్యకాపరమేశ్వరీదేవి



నంద్యాల పాతపట్టణం : బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో మహేశ్వరీదేవిగా అమ్మవారు



నంద్యాల గాంధీచౌక్ : కాళికాంబ ఆలయంలో అన్నపూర్ణాదేవి



నందికొట్కూరు : చౌడేశ్వరీ దేవి ఆలయంలో అన్నపూర్ణా దేవిగా అమ్మవారు



బండిఆత్మకూరు : ఓంకారంలో అన్నపూర్ణాదేవి రూపంలో అమ్మవారు



నంద్యాల పాతపట్టణం : బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయంలో కూష్మాండదేవి, గిరిజాదేవిగా అమ్మవారు



నందికొట్కూరు: కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణ



మహానంది : మయూర వాహనంపై చంద్రఘంట దుర్గ అలంకారంలో అమ్మవారి విహారం



నంద్యాల గాంధీచౌక్ : సంజీవనగర్‌లోని కోదండ రామాలయంలో చంద్రఘంటాదేవి

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమ్మవారికి రోజుకో అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మూడోరోజైన శనివారం శ్రీశైల భ్రమరాంబ, మహానంది కామేశ్వరీదేవి చంద్రఘంటాదేవి అలంకారంలో.. మిగతా ఆలయాల్లో అన్నపూర్ణేశ్వరి, గాయత్రీదేవి, కూష్మాండదేవి, గిరిజాదేవి, మహేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా పెద్దఎత్తున భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, నంద్యాల క్లస్టరు బృందం



నంద్యాల గాంధీచౌక్ : జగజ్జనని ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఆత్మకూరు : కిషన్‌సింగ్ వీధిలో అమ్మవారికి పూజలు

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్. శశికళ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 8న నిర్వహించనున్న ఉద్యోగ మేళాకు సంబంధించిన గోడపత్రాలను శనివారం ఆమె ఆవిష్కరించారు. టాటా, నవభారత్ ఫర్టిలైజర్స్, యంగ్ ఇండియా లిమిటెడ్ వంటి సంస్థలు ముఖాముఖి నిర్వహిస్తాయన్నారు. పదో తరగతి నుంచి పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 9182217075, 9440224291 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్రీడా దుస్తుల పంపిణీ

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్రం తరఫున జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న జట్టు సభ్యులకు శ్రీగురు రాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి శనివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక గురురాజ పాఠశాల మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సాఫ్ట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి నంద్యాలలో జాతీయస్థాయి పోటీలు జరగనుండటం శుభ పరిణామం అన్నారు. ఏపీ జట్టు పోటీల్లో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా సాఫ్ట్‌బాల్ కార్యదర్శి విజయకుమార్, పీడీ శ్రీధర్, ఈఈటీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సాఫ్ట్‌బాల్ జట్టుతో సంఘం సభ్యులు, గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి

భక్తిశ్రద్ధలతో స్వాతి నక్షత్ర పూజలు

నంద్యాల గాంధీచౌక్, పాతపట్టణం న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం తెలుగుపేటలో ఉన్న మద్దిలేటి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే స్వామివారికి పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజనం నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

శాస్త్రోక్తంగా చండీయాగాలు

మహానంది న్యూస్‌టుడే : మహానంది పుణ్యక్షేత్రంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మూడోరోజు శనివారం వేదపండితులు దుర్గాదేవి అమ్మవారికి చండీయాగాలు, నవావరణార్చన, కుంకుమార్చన, సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ఈ పూజల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. తిమ్మాపురం కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి

నందికొట్కూరు, గడివేముల, న్యూస్‌టుడే : మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. నందికొట్కూరు పట్టణ శివారులో, గడివేముల మండలంలోని కొర్రపోలూరు, తిరుపాడు గ్రామాల్లో శనివారం మొక్కజొన్న దిగుబడులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరి తర్వాత మొక్కజొన్న పంట అధికంగా సాగవుతుందన్నారు. పంట చేతికి రాకముందు క్వింటా ధర రూ.2,950 ఉండేదన్నారు. ప్రస్తుతం వ్యాపారులు, దళారులు కుమ్మక్కై క్వింటా రూ.2350కు కొంటున్నారని చెప్పారు. ప్రభుత్వమే రైతుల నుంచి మొక్కజొన్నలు కొనుగోళ్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, నాయకులు సుబ్బారెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్నలను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు, రైతులు

మద్యం దుకాణాలకు టెండర్ల స్వీకరణ

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆత్మకూరు అబ్కారీశాఖ పరిధిలోని మద్యం దుకాణాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నామని ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని సీఐ కిషోర్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక అబ్కారీ కార్యాలయంలో సీఐ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు పరిధిలోని ఆత్మకూరు, శ్రీశైలం, కొత్తపల్లి, వెలుగోడు, పాములపాడు మండలాల్లో 13 మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. దుకాణం టెండరు కోసం దరఖాస్తు చేసుకునే వ్యక్తులు రూ.2 లక్షలు డీడీ సమర్పించాలన్నారు. ఈ నెల 9వ తేదీకి టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని, 11వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. శనివారం వరకు ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదన్నారు.

అంధుల పాఠశాల అభివృద్ధికి సహకారం

పోలూరు (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే : అంధుల పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. మండలంలోని పోలూరు గ్రామ శివారులో లూయిస్ బ్రెయిలీ అంధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పాఠశాలను శనివారం ఆయన రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డా. రామకృష్ణారెడ్డితో కలిసి ఫిరోజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పోలూరు తెదేపా నాయకుడు జోజిరెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో ఆయన పాల్గొన్నారు. నంద్యాలలో ప్రముఖ సంస్థలు ఆధ్వర్యంలో ఉద్యోగ మేళాలు నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ డా. శశికళ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రారు కార్యాలయం ప్రారంభం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలలో ఆధునికీకరించిన సబ్ రిజిస్ట్రారు కార్యాలయాన్ని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రారు జానకిదేవి, సబ్ రిజిస్ట్రారు సత్తార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ చంద్రమౌళి, కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక ప్రగతి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : విద్యతోనే సామాజిక ప్రగతి సాధ్యమని ఆర్‌జేయూపీ రాష్ట్ర కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక భారత్ అకాడమీలో 'విద్య, ఉపాధి, వ్యక్తిత్వ వికాసం' అన్న అంశాలపై అకాడమీ సంచాలకులు గోపికృష్ణ ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. కవులు డా. నీలం వెంకటేశ్వర్లు, కొప్పుల ప్రసాద్, నీలకంఠమాచారి తదితరులు పాల్గొన్నారు.

బుక్‌కీపర్ ఎంపికపై వాగ్వాదం

జూపాడుబంగ్లా : జూపాడుబంగ్లాలో ప్రస్తుతం బుక్ కీపర్‌గా పనిచేస్తున్న జ్యోతి, ఏపీఎం అంబమ్మ మధ్య శనివారం వాగ్వాదం చోటుచేసుకుంది. పొదుపు సంఘాలలో అవినీతి జరిగిందంటూ బుక్‌కీపర్ జ్యోతిని తొలగించి, ఆమె స్థానంలో ఇతరులను ఎంపిక చేసేందుకు ఏపీఎం శనివారం పొదుపు మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. తమకు నోటీసు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని జ్యోతి ఏపీఎంతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువురికి సర్దిచెప్పారు. దీంతో బుక్‌కీపర్ ఎంపికను వాయిదా వేశారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన అవసరం


ఆత్మకూరు న్యూస్‌టుడే : రైతుసేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది వ్యవసాయ రంగంలో పాటించే సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త రామకృష్ణారావు, ఏడీఏ ఆంజనేయులు పేర్కొన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఒక్కరోజు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో సాగు చేసే ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న, మినుము, జొన్న మిరప పంటలలో సస్యరక్షణ చర్యల గురించి తెలుసుకోవాలన్నారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు హేమలత, విష్ణువర్ధన్‌రెడ్డి, ఫణేశ్వర్‌రెడ్డి, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రామకృష్ణారావు

మండలాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

మహానంది న్యూస్‌టుడే : సమిష్టి కృషితో మండలాన్ని అభివృద్ధి చేద్దామని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని పేర్కొన్నారు. మండలంలోని ఎం. తిమ్మాపురంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండలానికి కొత్తగా వచ్చిన ఎంపీడీవో మహబూబ్‌దౌలా, ఈవోఆర్డీ నాగేంద్రుడు, గృహనిర్మాణశాఖ ఏఈఈ షఫీవుల్లాలను శనివారం తెదేపా నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి చింతం క్రాంతికుమార్‌యాదవ్, మండల తెదేపా యూనిట్ ఇన్‌ఛార్జి కాకర్ల శివయ్య, నాయకులు తోట కిట్టు, పెద్ది నాగేష్, హరినాథరెడ్డి, అబ్దుల్లా, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



అధికారులను శాలువాతో సన్మానిస్తున్న తెదేపా నాయకులు

వ్యవసాయశాఖ విశ్రాంత డీడీ సుబ్బయ్య మృతి



సుబ్బయ్య (పాతచిత్రం)

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలకు చెందిన వ్యవసాయ శాఖ విశ్రాంత ఉప సంచాలకులు అన్నం సుబ్బయ్య (82) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. సుబ్బయ్య మృతికి పలువురు సంతాపం తెలిపారు. రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అన్నం సుబ్బయ్య భౌతిక కాయాన్ని వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుమారుడు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు.


అనుమతులున్న బోట్లు మాత్రమే తిరిగేలా చూడండి

కొత్తపల్లి, న్యూస్‌టుడే : సిద్ధేశ్వరం నుంచి తెలంగాణలోని సోమశిలకు కృష్ణానదిపై ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన బోట్లు మాత్రమే తిరిగేలా చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ సభుడు సోముల సుధాకర్‌రెడ్డి కోరారు. బోటు నిర్వాహకులతో కలిసి తహసీల్దార్ ఉమారాణికి శనివారం వినతిపత్రం అందజేశారు. పలువురు అనుమతులు లేకున్నా బోట్లు నడుపుతూ దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలి

పగిడ్యాల న్యూస్‌టుడే : మండలంలో రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని నందికొట్కూరు గ్రామీణ సీఐ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. మండల పరిధిలోని ముచ్చుమర్రి పోలీసుస్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు గురించి పోలీసు తెలుసుకున్నారు. ఎస్సై శరత్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పంట



అలగనూరులో వరి పొలంలో నిలిచిన వర్షంనీరు

మిడుతూరు న్యూస్‌టుడే : మండలంలోని అలగనూరు గ్రామంలో శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి వరి పొలాలు నీట మునిగాయి. 18.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. దాదాపు 20ఎకరాల పంట నీటి మునిగినట్లు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వర్షం నీటి నిల్వల తొలగింపు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పట్టణంలో శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి బైరెడ్డి శేషశయనారెడ్డి కాలనీ వద్ద వర్షం నీరు నిల్వ ఉండటంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న కమిషనర్ బేబీ పొక్లెయిన్ సాయంతో నీటిని తొలగింపజేయించారు.

యశస్విని.. నృత్య తపస్విని



నృత్యం చేస్తున్న యశస్విని

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : కూచిపూడితో పాటు జానపద నృత్యంలో నంద్యాలకు చెందిన యశస్విని అద్భుత ప్రతిభ చూపుతోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో శిక్షణ తీసుకుని.. నృత్య కౌశలం పెంపొందించుకుంది. పుణ్యక్షేత్రాల్లో వందల కొద్దీ ప్రదర్శనలు ఇచ్చి ఎన్నో పురస్కారాలు అందుకుంది. పోటీల్లో ప్రతిభ చూపుతూ బహుమతులు అందుకుంటూ విజయపథంలో సాగుతోంది.

● బండిఆత్మకూరు మండలం సంతజూటూరు గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి, రమాదేవి దంపతుల కుమార్తె యశస్విని. ప్రస్తుతం పట్టణంలో 7వ తరగతి చదువుతోంది. ఈ విద్యార్థిని సంప్రదాయ నృత్యంపై ఆసక్తి చూపుతుండటంతో తల్లిదండ్రులు శిక్షకుడు నరసింహులు వద్ద మూడేళ్లుగా కూచిపూడిలో శిక్షణ ఇప్పిస్తున్నారు. చదువులో రాణిస్తూనే ఖాళీ సమయాల్లో నృత్య సాధన చేసి పట్టు సాధించింది. ఇప్పటి వరకు వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చి పురస్కారాలు, బహుమతులు అందుకుంది.

బహుమతులు.. పురస్కారాలు

☛ 2023లో నంద్యాలలో కళారాధన ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి ప్రశంసా, జ్ఞాపికను అందుకుంది.

☛ 2023లో నంద్యాలలో జరిగిన బాలోత్సవంలో కూచిపూడి నృత్యంలో ద్వితీయస్థానం సాధించింది.

☛ 2024లో ఆగస్టులో నంద్యాలలో జరిగిన కూచిపూడి పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి బహుమతి అందుకుంది.

☛ 2024 జులైలో తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో నృత్య ప్రదర్శనలు చేసి ప్రశంసలు అందుకుంది.

☛ 2024లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం, మహానందిలో నృత్య ప్రదర్శనలు చేసి ప్రశంసా పత్రాలు అందుకుంది.

☛ 2024 ఆగస్టులో అభయ్ హిందూ సేన ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి బహుమతి అందుకుంది.

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ఈకేవైసీ పూర్తి చేయించాలి



పంట నమోదును పరిశీలిస్తున్న మురళీకృష్ణ

ప్యాపిలి, న్యూస్‌టుడే: ఖరీఫ్ 2024 పంట నమోదుకు సంబంధించి 95 శాతం మంది రైతులు ఈకేవైసీ చేసుకున్నారు, మిగిలిన వారు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. చంద్రపల్లె, కలుచట్ల గ్రామాల్లోని ఆయా సంబంధించి పంట నమోదు వివరాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందించాలన్నారు. వ్యవసాయాధికారి రాజేష్, విస్తరణ అధికారి పద్మప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

రసూల్‌కు బహుమతి



బహుమతి అందుకున్న షేక్ అబ్దుల్ రసూల్

సంజామల, న్యూస్‌టుడే: ఆకుమల్లకు చెందిన షేక్ అబ్దుల్ రసూల్ జాతీయ స్థాయి లాక్రోస్ చాంపియన్‌షిప్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచారని లాక్రోస్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి శనివారం చెప్పారు. ఆగ్రాలోని జాన్‌మిల్టన్ పాఠశాలలో సెప్టెంబరు 27 నుంచి 29 వరకు జరిగిన ఈ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొని ప్రతిభ కనబర్చారన్నారు. దీంతోనే మూడోస్థానంలో నిలవడంతో పలువురు ప్రశంసిస్తున్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: నందవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి నరేంద్ర రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు.

యాప్‌లో నమోదు చేయాలి

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పీఆర్వో యాప్‌లో నమోదు చేయాలని ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పీఆర్ కార్యదర్శులతో ఏర్పాటైన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలపై ఆయన కార్యదర్శులతో చర్చించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

బేతంచెర్ల: **సమస్య:** కొలుములపల్లెలోని ఓ వీధిలో సీసీ రోడ్డుపై మురుగు నిలిచి అపరిశుభ్రత నెలకొంది. –పాలశేఖర్, కొలుములపల్లె

సమాధానం: శుభ్రం చేయిస్తాం. –మహేష్, పంచాయతీ కార్యదర్శి.

సమస్య: ఆర్ఎస్ రంగాపురం రైల్వే గేటు సమీపంలో ప్రధాన రహదారి పక్కన వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. –రాజేష్.

సమాధానం: చర్యలు తీసుకుంటాం. –కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి.

సమస్య: ఖాదరబాదరకు బీటీ రహదారిని నిర్మించాలి. –రామచంద్రయ్య.

జవాబు: బీటీ రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. –సాలమ్మ, సర్పంచి, శిరివెళ్ల.

ప్యాపిలి: సమస్య: జలదుర్గంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న కాలువలో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. –రహిమాన్.

సమాధానం: శుభ్రం చేయిస్తాం. –దస్తగిరి, సర్పంచి.

చాగలమర్రి: సమస్య: ముత్యాలపాడు బస్టాండు ఆవరణలో మురుగుతో ఇబ్బందులుపడుతున్నాం. –షరీఫ్.

సమాధానం: చర్యలు తీసుకుంటాం –తాహీర్‌హుసేన్, ఈవోపీఆర్డీ, చాగలమర్రి.

సమస్య: డి.వనిపెంట నుంచి ముత్యాలపాడుకు వెళ్లే దారి పూర్తిగా అధ్వాన స్థితికి చేరింది. –నరేష్, డి.వనిపెంట.

సమాధానం: నిధులు మంజూరైతే పనులు చేపడతాం. –కొండారెడ్డి, పీఆర్ ఏఈ, చాగలమర్రి.

బనగానపల్లి: సమస్య: సర్కిల్ కార్యాలయం మీదుగా పాతబస్టాండుకు వెళ్లే దారిలో గుంత ప్రమాదకరంగా మారింది. దీన్ని పూడ్చాలి. –అబ్దుల్ రహిమాన్

సమాధానం: చర్యలు తీసుకుంటాం. –హరి ప్రసాద్, ఈవో.

అమృత్‌ధారలు కురిసేదెన్నడో?

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల పట్టణంలో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించటానికి ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద రూ.45 కోట్లు కేటాయించింది. కొత్తగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, పైపులైన్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనికి సంబంధించి టెండరు ప్రక్రియ పూర్తయి పనులు ఆర్డర్ కూడా ఇచ్చారు. పనులు పూర్తయితే శివారు కాలనీలు, సుబ్బారెడ్డి నగర్, సుద్దకుమ, సంజీవనగర్, హనుమాన్‌నగర్ కాలనీ వాసులు ట్యాంకర్ల నీటి కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఉండదని భావిస్తున్నారు.



ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం

బేతంచెర్ల పట్టణంలో 20 వార్డులు, 45 వేల మంది జనాభా ఉన్నారు. హనుమాన్‌నగర్, సుబ్బారెడ్డినగర్, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల సమీపంలోని కాలనీలు, డ్రైవర్ల కాలనీ, అల్లాబకష్ దర్గా ఏరియా తదితర ప్రాంతాలకు కుళాయిల ద్వారా నీరందడం లేదు. వర్షాకాలంలో కుళాయిలకు రోజు విడిచి రోజు నీరు పుష్కలంగా వదిలేవారు. ప్రస్తుతం వారం రోజులకోసారి నీరొస్తుండటంతో కాలనీవాసులు అవస్థలు తప్పడం లేదు. గోరుకల్లు జలాశయం పథకాన్ని వైకాపా ఆర్భాటంగా చేసి ప్రారంభించినా పూర్తిస్థాయిలో ఫలితాలను ఇవ్వలేదు. పూర్తిస్థాయిలో పైపులైన్, ట్యాంకులు, సంపులు పూర్తిక పోవడంతో చాలా కాలనీలకు సరిగా నీరందడం లేదు.

వారానికోసారి సరఫరా

స్థానిక ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల సమీపంలోని కాలనీలకు గతంలో రోజు విడిచి రోజు కుళాయిలకు నీరొచ్చేది. ప్రస్తుతం వారం రోజులు గడిచినా కుళాయిలకు నీరు రావడం లేదు. నీటిని తెచ్చుకోవాలంటే ఇళ్లల్లోని బోర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని ఆయా కాలనీవాసులు వాపోతున్నారు. హనుమాన్‌నగర్, సంజీవనగర్, దుర్గాపేట, డ్రైవర్ల కాలనీ, ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని వీధి, మంగళిగేరి తదితర ప్రాంతాలకు కుళాయిల ద్వారా నీరు అందడం లేదు. గత ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ట్యాంకర్ల ద్వారా ఆయా కాలనీలకు అరకొరగా తాగునీరు అందించారు. నాలుగైదు రోజులకోసారి నీరొస్తోందని ఆయా కాలనీవాసులు వాపోతున్నారు.

- అమృత్ 2.0 పథకం నిధులు: రూ.45 కోట్లు
- పట్టణ జనాభా: 45000, గృహాలు: 11,258
- కుళాయిల ద్వారా నీరందని కాలనీల సంఖ్య: 8
- రోజూ సరఫరా చేస్తున్న తాగునీరు: 3.04 ఎంఎల్‌డి
- ప్రస్తుతం ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు: 11
- అమృత్ పథకంలో కొత్తగా నిర్మాణం చేయడంలో ట్యాంకుల సంఖ్య: 6
- కొత్తగా నిర్మాణం చేయబోయే సంపుల సంఖ్య: 2
- పైపులైన్ నిర్మాణం దూరం: సుమారు 53 కిలో మీటర్లు

త్వరగా పనులు జరిగేలా చూస్తాం

–హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్

పట్టణంలో నీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. అమృత్ 2.0 పథకం పనుల ప్రక్రియను త్వరితగతిన చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటాం. వీలైనంత త్వరగా ఈ పథకం పనులు ప్రారంభించేలా కృషి చేస్తాం.

అవీ.. ఇవీ.. అన్నీ..

యర్రగుంట్ల(శిరివెళ్ల), న్యూస్‌టుడే: యర్రగుంట్లలో బీసీ, ఎస్సీ, ఓసీ కాలనీల్లో గ్రామసింహాల బెడదతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యర్రగుంట్ల(శిరివెళ్ల), న్యూస్‌టుడే: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమౌతుందని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సువర్ణలత పేర్కొన్నారు. యర్రగుంట్లలోని 2, 4 అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం తనిఖీ చేసి దస్త్రాలను పరిశీలించారు.

యర్రగుంట్ల(శిరివెళ్ల), న్యూస్‌టుడే: వైఎస్సార్-కర్నూలు 40వ జాతీయ రహదారిలోని యర్రగుంట్ల బస్టాప్‌వద్ద కాలువలో మురుగు పారక, అపరిశుభ్రత పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను డోన్ పుర కమిషనర్ ప్రసాద్‌గౌడ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న భోజన కార్మికులను తొలగించకుండా చూడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, ఉపాధ్యక్షుడు ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

రుద్రవరం, న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఏడు రోజుల పాటు అగ్రికల్చర్ ఇంటర్న్‌షిప్‌ను నిర్వహించనున్నట్లు శిక్షకురాలు జ్యోతిప్రియ తెలిపారు. శనివారం ఆమె విద్యార్థులతో కలిసి ఆర్బీకేలు, రసాయనిక మందుల దుకాణాల్లో మందుల వినియోగం, బయోమాస్, నేల తదితర వాటిపై అవగాహన కల్పించారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దసరా సెలవుల్లో నిర్వహిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ మండల కార్యదర్శి చంద్రశేఖర్ నాయక్ శనివారం డిమాండు చేశారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన మేలిగిరి ఈశ్వరమ్మ మట్టి మిద్దె శనివారం కూలిపోయింది.

ప్యాపిలి, న్యూస్‌టుడే: పుట్టిన బిడ్డకు టీకాలు వేసి వ్యాధులు సంక్రమించకుండా కాపాడుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విద్యాబోధకుడు రాఘవేంద్రగౌడు పేర్కొన్నారు. వెంకట్‌రెడ్డి కాలనీలో శనివారం టీకాలపై మాట్లాడారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం చైతన్య పాఠశాలలో ఆయన మాట్లాడారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: న్యాయవాదులకు రక్షణ చట్టం అమలుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాయవాది పులి దామోదర్ పేర్కొన్నారు. శనివారం నంద్యాల జిల్లా బార్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: డోన్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా మస్తాన్ బాధ్యతలు చేపట్టారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి ఆలయానికి నంద్యాల పట్టణానికి చెందిన వి. రంగారెడ్డి, ప్రవంతి (నంద్యాల జిల్లా ఆడిట్ అధికారి) దంపతులు 510 గ్రాముల వెండి హారతిని అందజేశారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: విజయవాడలో ఈ నెల 9న బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గం అధ్యక్షుడు జి. చిన్నయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీసీల కోసం చేపట్టే నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో బహుజనులు తరలి రావాలని అన్నారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ఉయ్యాలవాడ పీఆర్ ఏఈగా వెంకటయ్య, ఈవోఆర్డీ వెంకటేశ్వరరావు, శనివారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 9న చివరి తేదీ అని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ టక్కీబాషా తెలిపారు. కోవెలకుంట్లలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సైలు ప్రవీన్‌కుమార్ నాయక్, సందీప్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ప్రముఖ ప్రవచన కర్త రాధామనోహర్ దాస్ శనివారం రాత్రి అమ్మవారి శాలలో పూజలు నిర్వహించారు. ఆయన్ని ఆర్యవైశ్య కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి సమక్షంలో పూజలు చేసిన ఆయన తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లోకజనని... కరుణరూపిణి



యర్రగుంట్లలో అన్నపూర్ణాదేవి



సంజామల: అన్నపూర్ణదేవి



రుద్రవరం: సంతానలక్ష్మీ దేవి



ఆళ్లగడ్డలో.. గాయత్రి దేవి అలంకారం




అవుకులో బాలా త్రిపురసుందరి

దసరా నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. శనివారం దుర్గమ్మా... ఆశీర్వదించమ్మా... అంటూ భక్తిశ్రద్ధలతో కొలిచారు. కోరిన కోర్కెలు తీర్చేకల్పవలి... శరణు.. శరణు అంటూ మొక్కారు. నీ చల్లని చూపులే మాకు రక్ష అంటూ పూజించారు. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి మనసారా కొలిచారు.

–న్యూస్‌టుడే బృందం.



ముత్యాలపాడు: శారదాదేవి అలంకారంలో అమ్మవారు



బనగానపల్లి: గాయత్రిదేవి అలంకారం



ప్యాపిలిలో: దుర్గమ్మ దేవాలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం



బనగానపల్లి: చంద్రఘంట అలంకారం

క్రైం కార్నర్

మృతదేహం గుర్తింపు

అవుకు, న్యూస్‌టుడే: అవుకు జలాశయం పరిధిలోని పాలేరు కట్ట వద్ద స్థానికులు శనివారం మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. గాలేరు-నగరి కాల్వ నీటిలో ఇది కొట్టుకుని వచ్చి ఉండొచ్చని, పురుషుడి మృతదేహంగా గుర్తించిన పోలీసులు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు

మద్యం సీసాలు స్వాధీనం

మాచినేనిపల్లె(రుద్రవరం), న్యూస్‌టుడే: మాచినేనిపల్లెలో 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు. చిన్నపుల్లయ్యను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బేతంచెర్ల,న్యూస్‌టుడే: కటికవానికుంటకు చెందిన మహిళ బేతంచెర్ల మండలం గొర్లగుట్టలో సారా విక్రయిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకుని 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ షేక్షావలి తెలిపారు.

చంపుతానని బెదిరించినందుకు కేసు

రుద్రవరం, న్యూస్‌టుడే: చంపుతానని బెదిరించినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు. బ్రహ్మానికి, అన్న హరికి మధ్య ఆస్తి తగాదాలున్నాయని, ఆగస్టు 15న తండ్రి వర్ధంతికి ఇంటికి రావడంతో హరిని చంపుతానని బ్రహ్మం బెదిరించి దుర్భాషలాడారని హరి భార్య సుధారాణి ఫిర్యాదు మేరకు బ్రహ్మంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిపై దాడి

దొర్నిపాడు, న్యూస్‌టుడే: మాటకు మాట పెరిగి వ్యక్తిపై దాడి జరిగిన ఘటన దొర్నిపాడులో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన జోష్‌ను అదే గ్రామానికి చెందిన రవి దాడి చేశాడని పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు.

లారీ బోల్తాపడి వ్యక్తి మృతి

చేగుంట, న్యూస్‌టుడే: పాత ఇనుప సామగ్రితో వెళ్తున్న వాహనం రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని బోల్తాపడటంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మెదక్ జిల్లా చేగుంట వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిందని ఎస్సై చైతన్యరెడ్డి వివరాలు తెలిపారు. బల్లాలపల్లికి చెందిన మంత్రియల్ల నాగయ్య(43) హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ శివరాంపల్లిలో ఉంటున్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో పాత ఇనుమ సామాను తెచ్చేందుకు లారీలో బయల్దేరారు. రాత్రి అక్కడి నుంచి డ్రైవర్‌తో కలిసి తిరిగి వస్తున్నారు. చేగుంట జాతీయ రహదారి బైపాస్ వంతెన వద్ద డ్రైవర్ అతివేగంగా నడిపి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టడంతో లారీ బోల్తాపడింది. క్యాబిన్‌లో కూర్చున్న నాగయ్య కిందపడటంతో గాయపడ్డారు. కొంపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

నిలిచిన నీటితో ఇక్కట్లు



కోవెలకుంట్ల-జమ్మలమడుగుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి నిండా గోతుల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సమస్యను గుర్తించి గుంతల్ని పూడ్చడానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ సమస్యను శనివారం కోవెలకుంట్ల ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా...రోడ్డుపై పడిన గుంతల్ని తాత్కాలికంగా పూడ్చడానికి చొరవ చూపుతామని తెలిపారు.

–న్యూస్‌టుడే, మాయలూరు(ఉయ్యాలవాడ)

చెత్త సేకరించేదెలా...?

సౌదరదిన్నెలో చెత్త సేకరణకు అవసరమైన రిక్షాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇవన్నీ నిరుపయోగమవుతున్నాయి. రెండు రిక్షాలకు గానూ ఒకటే వినియోగంలో ఉందని అధికారులు చెబుతున్నారు. పాడైన వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, సౌదరదిన్నె(కోవెలకుంట్ల గ్రామీణం)



రైతు సంక్షేమమే తెదేపా లక్ష్యం



ధర్మవరం సుబ్బారెడ్డిని అభినందిస్తున్న షేక్షావలి చౌదరి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: రైతుల సంక్షమమే తెదేపా ప్రధాన లక్ష్యమని తెదేపా పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి పేర్కొన్నారు. విజయవాడలో సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ధర్మవరం సుబ్బారెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. రైతుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్పొరేషన్ పదవి ఇచ్చినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు ధర్మవరం ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగి జీవితంలో బదిలీ సాధారణమే

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: బదిలీలు ఉద్యోగి జీవితంలో సాధారణమని వెలుగు పీడీ వైబీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. ప్రాంతీయ సమన్వయకర్తగా జిల్లా పరిధిలో 13 ఏళ్లుగా పనిచేసి ప్రకాశం జిల్లాకు బదిలీ అవుతున్న డి. దానంను ఆయన శనివారం సన్మానించి మాట్లాడారు. అందర్నీ సమన్వయపర్చి చక్కటి ఫలితాలు సాధించారన్నారు. అన్ని మండలాల వెలుగు సీసీలు, ఏపీఎంలు, వీవోఏలు పాల్గొన్నారు.



సన్మానం అందుకుంటున్న దానం

నిర్ణయాలు అమలు చేయాలి

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను త్వరగా అమలు చేయాలని అధికారులను పుర ఛైర్మన్ సప్తశైల రాజేష్ సూచించారు. శనివారం డోన్ పురపాలక కార్యాలయంలోని ఛైర్మన్ ఛాంబర్‌లో కమిషనర్ ప్రసాద్‌గౌడ్, డీఈ రఘు, ఏఈ సురేష్‌లతో ఆయన పలు అంశాలపై సమీక్షించారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, తాగు నీరు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర వాటిపై దృష్టిసారించాలని కోరారు.

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణంలో నెలకొన్న వివిధ విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పట్టణ ఏఈగా బాధ్యతలు చేపట్టిన పుల్లయ్య పేర్కొన్నారు. పాణ్యంలో ఏఈగా పనిచేస్తున్న ఆయనను సాధారణ బదిలీల్లో భాగంగా బేతంచెర్ల పట్టణ ఏఈగా బదిలీపై వచ్చారు. శనివారం ఉదయం స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ విద్యుత్తు లైన్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ బాబు, లైన్మేన్ మస్తాన్, శ్రీనివాసులు గౌడ్, గుత్తేదారుడు కిషోర్ ఏఈని కలిసి అభినందనలు తెలిపారు.



ఏఈ పుల్లయ్యను అభినందిస్తున్న సిబ్బంది

కొలిమిగుండ్ల.. సమస్యలు నిండా

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: పల్లె సీమలే దేశానికి పట్టుగొమ్మలు ఇది ఒకప్పటి మాట. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఇప్పుడు గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గత ప్రభుత్వం అభివృద్ధి నిధులు విదల్చకపోవడంతో ఎక్కడికక్కడ అసౌకర్యాలు అవస్థలపాల్జేస్తున్నాయి.



కాలనీలో వెలగని వీధి దీపం

పేరుకే మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో జనాలు అవస్థల మధ్య జీవనాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామంలో దాదాపుగా 5,500 మంది వరకు జనాభా ఉన్నారు. ఇక్కడ ప్రభుత్వ వైద్యశాలకు సమీపంలోరని కాలనీలో 80 కుటుంబాలు ఉండగా.. ఇక్కడ ఎటువంటి సౌకర్యాలు లేవని వారంతా ఆందోళన చెందుతున్నారు. సిమెంటు దారులు లేవని, వీధి దీపాలు వెలగక చీకట్లలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. అయిదు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా... ఇందులో రెండు కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని చెబుతున్నారు. మరో రెండు భవనాలకు నిధులు మంజూరు చేసినా గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని పనుల్ని మధ్యలోనే గుత్తేదారుడు విడిచిపెట్టడంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఇబ్బందులు తప్పడం లేదు.

అధ్వాన రహదారులతో అవస్థలు

జ్వాలా కాంప్లెక్సు నుంచి ప్రాథమిక పాఠశాల వరకు రోడ్డు నిండా గోతులు తేలడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. చెన్నకేశవస్వామి దేవాలయం సమీపంలో ఉన్న సీసీ రహదారిపైనా మురుగుపారుతుండటంతో ఈ దారిలో ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. శాంతినగర్ కాలనీ, చల్లా కాలనీ, ఎస్సీ కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జలజీవన్ కింద చేపట్టిన తాగునీటి పథకానికి సంబంధించిన నిధులు రాలేదని గుత్తేదారుడు మధ్యలోనే ఆపేయడంతో నీటి కష్టాలు తప్పడం లేదు. నాయునిపల్లె రహదారిలోని ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేదని, ప్రధాన ప్రాథమిక పాఠశాల సమీపంలోనే మురుగు నిల్వ ఉండటంతో వాసనను భరించలేకున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. వారపుసంతకు సొంత స్థలం లేక ఒక రైతుపొలంలో నిర్వహించాల్సి వస్తోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దుర్వాసనను భరించలేకున్నాం

–సీతారామయ్య



ప్రాథమిక పాఠశాల సమీపంలో మురుగు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోంది. అందులో చెత్తా చెదారం పేరుకుపోయింది. దోమలకు ఆవాసాలుగా మారాయి. రాత్రిళ్లు జాగారం చేయాల్సి వస్తోంది.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

–చంద్రమోహన్



గ్రామంలో చాలా వీధుల్లో దీపాలు వెలగడం లేదు. చీకట్లలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అధికారులకు చాలాసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు.